

పరదేశీ కథలు

- చిట్టి సిద్ధ లలిత



- 142 -

కలల తీరం

సాయంత్రం చీకట్లు ముసురుకుంటున్న వేళ, ఇంటి వెనుక ఉన్న చింతచెట్టు కిందకి వచ్చింది స్వప్న. ఆమెను, క్రుంగిపోయిన రూపాన్ని చూడగానే పద్మ ఒక్కసారిగా తల్లడిల్లిపోయింది. పచ్చటి పైట చాటున దాచాలని చూస్తున్నా... స్వప్న మెడ మీద, చేతుల మీద స్పష్టంగా కనిపిస్తున్న నీలిరంగు దెబ్బల గుర్తులు ఆమె పడుతున్న నరకానికి సాక్ష్యాలుగా నిలిచాయి.

"నన్ను మనిషిలా కూడా చూడటం లేదు పద్మా... రోజూ తాగి రావడం, కాళ్లతో తన్నడం... నన్ను పశువు కంటే హీనంగా బాదుతున్నాడు. అత్తమామలు, ఆడపడుచు చోద్యం చూస్తున్నారే కానీ అతడిని వారించడం లేదు. ఆ నరకం నేను భరించలేకపోతున్నాను" అంటూ స్వప్న పద్మను పట్టుకుని గుండెలు పగిలేలా ఏడ్చింది. ఆ కన్నీటి స్పర్శ పద్మ రక్తాన్ని మరిగించింది.

పదో తరగతి పరీక్షల్లో బడిలోనే ఫస్ట్ వచ్చిన పద్మ, సెకండ్ వచ్చిన స్వప్న రిజల్ట్స్ వచ్చిన రోజు పంచుకున్న నవ్వుల వెలుగులు పట్టుమని పది రోజులు కూడా నిలవలేదు. పల్లెటూరు కావడం, పైచదువుల కోసం పక్కనే ఉన్న టౌనుకు వెళ్లాల్సి రావడంతో ఇద్దరి ఇళ్లల్లోనూ పెద్ద రచ్చ జరిగింది.

"ఆడపిల్లలకు చదువు దేనికి? నాలుగు అక్షరాలు చదివారు, ఇక చాలు ఒక అయ్య చేతిలో పెడితే బాధ్యత తీరుతుంది" అని తల్లిదండ్రులు తెగేసి చెప్పారు.

అనుకున్నట్టే స్వప్న వద్దు మొర్రో అని ఏడుస్తున్నా చదువును ఆపేసి, వచ్చిన మొదటి సంబంధంతోనే పెళ్లి చేసి పంపేశారు. కానీ ఆమెను చేసుకున్న భర్త ఒక తాగుబోతు, స్వార్థపరుడు, దయాదాక్షిణ్యాలు లేని రాక్షసుడు. స్వప్నను పెట్టని బాధలు లేవు. ఆ బాధలు భరించలేక స్వప్న పుట్టింటికి వచ్చేసింది. భర్త అన్నాక తిడతాడు, కొడతాడు. అది సహజమే..! ఇలా పుట్టింటికి రాకూడదు అని స్వప్న తల్లితండ్రులు హితబోధ చేస్తున్నారు.

ముందు నుయ్యి, వెనక గొయ్యిలా వుంది స్వప్న పరిస్థితి.

తన ప్రాణస్నేహితురాలి విరిగిన స్వప్నాన్ని చూశాక పద్మలో ఆవేదన కలిగింది. అదే సమయంలో కొత్త తెగింపు పుట్టుకొచ్చింది. ఆడపిల్లల బతుకులను బలితీసుకునే ఈ మూర్ఖత్వానికి చరమగీతం పాడాలని, ఊరి తలరాతను మార్చాలని, ఆడపిల్లల కలలకు తీరాలను నిర్మించాలని ఆ క్షణమే ఆమె మనసులో ప్రతిజ్ఞ చేసుకుంది.

స్వప్న గురించి ఆలోచిస్తూ చింతిస్తుంటే పుండు మీద కారం చల్లినట్లు పద్మ ఇంట్లో కూడా పెళ్లి సంబంధం మాట మొదలైంది. తండ్రి రామయ్య, తల్లి లక్ష్మి ఆమెను గదిలోకి పిలిచారు.

"పద్మా, రేపు నిన్ను చూడటానికి పక్క ఊరినుంచి పెళ్లివారొస్తున్నారు. మంచి సంబంధం, కుర్రాడికి సొంత పొలం ఉంది, వాళ్ళకు నువ్వు నచ్చితే వెంటనే పెళ్ళి చేసేస్తాం." అన్నాడు రామయ్య నిర్దాక్షిణ్యంగా...

పద్మ అడుగు ముందుకు వేసి, ధైర్యంగా కొంత కోపంతో అంది,

"నేను ఇప్పుడు పెళ్లి చేసుకోను నాన్నా. నేను చదువుకోవాలి, ఉద్యోగం చేయాలి అంది నోరు పెగుల్చుకుని..."

"చదువుకొని ఏం సాధిస్తావ్? స్వప్నను చూశావుగా? తల్లితండ్రి చెప్పినట్లు పెళ్ళి చేసుకుంది. వయసు వచ్చిన ఆడదానికి మగవాడి నీడ ఉంటేనే గౌరవం" అంది తల్లి లక్ష్మి కోపంగా...

"ఆ నీడ నరకమైతే ఎలా అమ్మా? స్వప్న లాగా నేను ఓడిపోవడానికి సిద్ధంగా లేను. ఊరిలో కాలేజీ లేదు కాబట్టే కదా మన ఊరి ఆడపిల్లల చదువు ఆగిపోతోంది? నేను ఈ ఊరిలో ఆడపిల్లల కోసం కాలేజీ కడతాను. ఆడపిల్లలందరినీ స్వంత కాళ్లపై నిలబెడతాను" అంది పద్మ పట్టుదలగా...

రామయ్య కోపంతో ఊగిపోతూ పద్మ చెంప ఛెళ్ళుమనిపించాడు.

"రూపాయి చేతిలో లేదు, కాలేజీ కడతావా? నీకు పిచ్చి పట్టిందా? పెద్ద పెద్ద మాటలు మాట్లాడకు. నోరు మూసుకుని పెళ్లికి ఒప్పుకో!" అని కేకలు వేశాడు.

చెయ్యి చేసుకున్నా పద్మ కళ్లల్లో నీరు తిరగలేదు, ఆమెలో కేవలం పట్టుదల మాత్రమే మిగిలింది. తన ఆశయ సాధనకు డబ్బు కావాలని ఆమెకు తెలుసు. అదే ఊరిలోని ఒక ఏజెంట్ ద్వారా కువైట్ వెళ్లే మార్గం ఉందని తెలుసుకుని, తల్లిదండ్రులు తిడుతున్నా పట్టించుకోకుండా, తనకు ఉన్న ఒక్క గాజును అమ్మేసి కువైట్ విమానం ఎక్కింది. తల్లితండ్రి చెప్పినమాట విని పెళ్ళి చేసుకోకుండా బరితెగించి ఇష్టమొచ్చినట్లు పోతోంది.

అని పద్మను ఊరివాళ్ళు తూలనాడారు.

తనఆశయసాధనకోసం తెగించి గొప్ప నిర్ణయం తీసుకుంది పద్మ. ఇది ఒక ఆడపిల్లకు సాహసమే..!

కువైట్ గడ్డపై కాలుపెట్టిన పద్మకు మొదట్లో జీవితం సుడిగుండంలా మారింది. యాభై డిగ్రీల ఎడారి వేడి, బొత్తిగా అర్థం కాని అరబిక్ భాష, కంటినిండా నిద్రలేని రాత్రులు ఆమెను కుంగదీశాయి. ఒక పెద్ద అరబ్ సేటు భవంతిలో

కద్దామాగా చేరింది. రోజూ ఉదయం నాలుగు గంటలకే లేచి, పది గదుల ఇల్లు శుభ్రం చేయడం, వంట పనులు, బట్టలు ఉతకడం... ఇన్ని పనులు ఆమె ఎప్పుడూ చెయ్యలేదు. కానీ తప్పలేదు. రోజంతా శ్రమతో రాత్రయితే ఒళ్లు తూలిపోయేది.

అయినా ఆమె గుండెల్లోని జ్వాల ఆరలేదు. రాత్రిపూట అందరూ నిద్రపోయాక, చిన్న డిమ్ లైట్ వెలుగులో అరబిక్ పదాలను, ప్రాథమిక ఇంగ్లీష్‌ను సొంతంగా రాసుకుంటూ నేర్చుకోవడం మొదలుపెట్టింది. నిద్రలేమితో కళ్లు మండిపోతున్నా, స్నేహితురాలైన స్వప్న కన్నీళ్లను గుర్తుచేసుకుని ధైర్యం తెచ్చుకునేది. ఆమె అంకితభావం, సమయస్ఫూర్తిని గమనించిన సేటు భార్య ఆశ్చర్యపోయింది.

ఒకరోజు ఆఫీసు పనిమీద సేటు ఇంట్లో ముఖ్యమైన వ్యాపార లెక్కల పత్రాలను సరిచూసుకుంటున్నప్పుడు, ఒక భారీ పొరపాటును పద్మ గమనించింది. ధైర్యం చేసి, తాను నేర్చుకున్న అరబిక్‌లోనే ఆ పొరపాటును సేటుకు వివరించి చూపించింది. ఆ ఒక్క తప్పు వల్ల సేటుకు కోట్లాది రూపాయల భారీ నష్టం జరిగి ఉండేది. పద్మ సమయస్ఫూర్తికి, తెలివితేటలకు సేటు ముగ్ధుడయ్యాడు.

"నీ స్థానం ఇంట్లో కాదు, నా ఆఫీసులో" అని చెప్పి, ఆమెను వెంటనే తన కంపెనీలో అకౌంటెంట్ గా, ఆపై తన మేనేజర్‌గా ప్రమోట్ చేశాడు. వ్యాపారంలో కీలక లావాదేవీలను పద్మ సక్సెస్ ఫుల్‌గా నడిపించింది. కంపెనీ క్లయింట్లతో డీల్స్ కుదుర్చుకోవడంలో ఆమె చూపిన ప్రతిభకు భారీ జీతంతో పాటు బోనస్‌లు అందాయి. తిండికి, గది అద్దెకు మాత్రమే అత్యంత పొదుపుగా వాడుకుని, మిగతా ప్రతి పైసానూ భారతదేశంలోని తన బ్యాంక్ ఖాతాకు మళ్లించింది. ఒంటరితనం, ఎడారిలో వీచే వేడిగాలులు ఆమె శరీరాన్ని దహించినా, ఆమె మనసులో మాత్రం స్వప్న ముఖం, ఊరి ఆడపిల్లల భవిష్యత్తే మెదులుతూ ఉండేవి. స్వప్నతో తరచూ ఫోన్లో మాట్లాడుతూ ధైర్యం చెప్తూ, ఆమెను ఆర్థికంగా ఆదుకునేది.

పదేళ్లు కంటిమీద కునుకు లేకుండా ఎడారిలో కష్టపడి రక్తాన్ని దినారులుగా మార్చింది పద్మ. ఎడారి ఎండల్లో ఆమె చిందించిన ప్రతీ చెమట బొట్టు వెనుక తన ఊరి ఆడపిల్లల భవిష్యత్తు నిలిచింది. కోట్లాది రూపాయల ధనం, దానికి తోడు వ్యాపార నిర్వహణలో అపారమైన అనుభవం సమకూరిన తర్వాత, తన కలల ప్రాజెక్ట్ సాధన కోసం పద్మ తిరుగు ప్రయాణమైంది.

పదేళ్ల తర్వాత విమానం దిగి ఊరిలో అడుగుపెట్టిన పద్మను చూసి ఊరి జనం నోళ్లెళ్లబెట్టారు. ఒకప్పుడు ఇంటి నుంచి పారిపోయిందని నిందించిన నోళ్లే, ఇప్పుడు ఆత్మవిశ్వాసం ఉట్టిపడుతున్న ఒక వ్యాపారవేత్తలా ముందడుగు వేస్తున్న పద్మను చూసి విస్తుపోయాయి.

పద్మ నేరుగా స్వప్న ఇంటికి వెళ్లేసరికి, స్వప్న ఇంకా ఆ దరిద్రంలోనే కష్టాల సుడిగుండంలో కాలం వెళ్లదీస్తోంది. పద్మను చూసి నమ్మలేక కళ్లల్లో నీళ్లతో పరుగెత్తుకొచ్చి కౌగలించుకుంది.

"స్వప్నా, నీ కన్నీళ్ల కాలం ముగిసింది. ఇక మన ఊరిలో ఏ ఒక్క ఆడపిల్ల చదువు ఆగిపోదు, ఏ ఒక్క మహిళా వేధింపులకు గురికాదు" అని పద్మ స్వప్న చేతిలో చెయ్యి వేసి మాట ఇచ్చింది.

పద్మ ఆలస్యం చేయకుండా తన సొంత డబ్బుతో ఊరి పొలిమేరల్లో ఉన్న పది ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. కొద్ది నెలల్లోనే రాళ్లు, రప్పలు ఉన్న ఆ నేలపై ఒక అద్భుతమైన విద్యాలయం రూపుదిద్దుకుంది. స్వప్న మహిళా కళాశాలలో ఊరి ఆడపిల్లలకు ఉచితంగా చదువు, ఉచిత హాస్టల్ వసతి ఏర్పరిచింది.

ప్రాథమిక వైద్య శాల నెలకొల్పి గ్రామీణులకు ఉచిత వైద్యం అందేలా చేసింది. ఊరి మహిళలకు కుట్టు మిషన్లు, చేతివృత్తులు, కంప్యూటర్లు నేర్పి ఉపాధి కల్పించే కేంద్రం కూడా నెలకొల్పి శభాష్ అనిపించుకుంది.

గ్రామంలోని పురుషులు మొదట్లో కుట్రలు చేసేందుకు ప్రయత్నించినా, పద్మ తెగింపును, కలెక్టర్ స్థాయి అధికారులతో ఆమెకున్న సంబంధాలను చూసి వెనక్కి తగ్గక తప్పలేదు. స్వప్నను ఆ కుటీర పరిశ్రమ రంగానికి ఇన్చార్జ్‌గా నియమించి, ఆమెకు సొంత కాళ్లపై నిలబడే ధైర్యాన్ని, ఒక కొత్త జీవితాన్ని ఇచ్చింది పద్మ.

కాలేజీ, ఆసుపత్రి ప్రారంభోత్సవ దినం వచ్చింది. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఊరంతా పండగ వాతావరణం నెలకొంది. పద్మను దూషించిన ఊరే ఈ రోజు ఆమె కాళ్ల దగ్గర గౌరవంతో తలవంచింది.

రిబ్బన్ కట్ చేసిన అనంతరం కలెక్టర్ మైక్ ముందుకు వచ్చి మాట్లాడారు.

"ఒక సాధారణ పల్లెటూరి అమ్మాయి, ఆర్థిక ఇబ్బందులను, సమాజపు మూఢనమ్మకాలను, తల్లితండ్రులను ఎదిరించి, విదేశాలకు వెళ్లి కష్టపడి సంపాదించిన డబ్బుతో ఈ రోజు తన ఊరి భవిష్యత్తునే మార్చేసింది. పద్మ సాధించిన ఈ విజయం కేవలం ఈ ఊరికే కాదు, దేశానికే ఆదర్శం. ఆడపిల్లలకు చదువు ఉంటే ఒక కుటుంబమే కాదు, తరతరాల మూఢత్వంతో మసిబారిన సమాజమే మారుతుందని పద్మ నిరూపించింది" అని కలెక్టర్ పద్మను అభినందిస్తూ సత్కరించారు.

సభలో ముందు వరసలో కూర్చున్న పద్మ తల్లిదండ్రులు ఆనందబాష్పాలతో, చేసిన తప్పుకు పశ్చాత్తాపపడుతూ కూతురి వైపు చూశారు.

వేదిక పైకి వచ్చిన పద్మ, మైక్ అందుకుని, "ఈ కాలేజీ నా ఒక్కదాని విజయం కాదు. నాలాగే చదువుకోవాలనే ఆశ ఉన్న, అసహాయురాలైన ప్రతీ ఆడపిల్ల కల ఇది. ఆడపిల్లలు ఎవరిపైనా ఆధారపడకూడదు, తమ కాళ్లపై తాము నిలబడాలి" అంది.

ఎదురుగా కూర్చుని ఆనందబాష్పాలతో చప్పట్లు కొడుతున్న స్వప్నను చూసి పద్మ సంతోషించింది.

ఒకప్పుడు పదో తరగతిలో ఫస్ట్ వచ్చినా కాలేజీ చదువుకు వెళ్ళలేక నిరాశచెందిన వారి కథ, నేడు వేలాది మంది ఆడపిల్లలకు ఆశాదీపమై కొత్త అరుణోదయానికి నాంది పలికింది.

(మరోకథ వచ్చేనెల)

Post your comments